సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



రాజన్నా కరుణించు

వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో భక్తుల రాక పెరిగింది.



మిడ్‌మానేరులో 20 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో నీటిమట్టం 20.34 టీఎంసీలకు చేరింది. సోమవారం ఎల్‌ఎండీకి నీటి విడుదల నిలిపివేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం

31.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ కలెక్టర్లు



కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసిన డిప్యూటీ కలెక్టర్లు గంగయ్య, సదానందం, శ్రీనివాస్

సిరిసిల్ల: డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందిన కలెక్టరేట్ ఏవో బొద్దుల గంగయ్య, వేములవాడ ఆర్డీవో ఆఫీస్ ఏవో నక్క శ్రీనివాస్, తంగళ్లపల్లి తహసీల్దార్ పిట్టల సదానందం సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. బొద్దుల గంగయ్యను వేములవాడ ఆలయ ఈవోగా, నక్క శ్రీనివాస్‌ను డీఆర్‌డీవోగా, సదానందంను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా భూసేకరణ విభాగంలో నియమించారు. ఈమేరకు వీరు విధుల్లో చేరనున్నారు. కలెక్టరేట్‌లోనే అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్‌ను కలిసి పూలమొక్కను అందించారు.

కార్మికుల కష్టాన్ని దోచుకోకండి



ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు కదారి రాములు, కార్మికులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల కష్టాన్ని కాంట్రాక్టర్ దోచుకోకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు కదారి రాములు ఈవో కృష్ణప్రసాద్‌ను కోరారు. ఈమేరకు సోమవారం వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. వేతనాలు, ఈపీఎఫ్ డబ్బులు సరిగ్గా ఇవ్వడం లేదన్నారు.


'డబుల్' ఇళ్లు మంజూరు చేయండి



ధర్నా చేస్తున్న తురక కాశీ కుటుంబాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని దుమాల గ్రామానికి చెందిన తురక కాశీ కుటుంబాలు సోమవారం ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ షేక్ గౌస్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తురక కాశీ కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లలోకి నీళ్లు వచ్చి నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా తురక కాశి కుటుంబాల గుడిసెల్లోనే జీవిస్తున్నారని, బండరాళ్లను కొడుతూ బతుకుతున్నారన్నారు. నిరుపేదలైన తురక కాశీ కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు అనవేని రవి, నాయకులు చెన్ని బాబు, గంట బుచ్చాగౌడ్, కొత్తపల్లి దేవయ్య, భాను, ఎండీ ఇమామ్, మహేందర్, తిరుపతిగౌడ్, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేయండి



జిందం కళకు వినతిపత్రం ఇస్తున్న గౌడసంఘం నాయకులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల బైపాస్‌రోడ్‌లో నర్సింగ్ కాలేజీ సర్కిల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ సోమవారం గౌడసంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళకు వినతిపత్రం అందించారు. గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆగస్టు 18న పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఖర్చులతో విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గౌడసంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్గం నాగరాజ్‌గౌడ్, బండి దేవదాస్‌గౌడ్, అధికార ప్రతినిధులు కందుకూరి రామాగౌడ్, కొండ రమేశ్‌గౌడ్, నర్సయ్యగౌడ్, అలేఖ్యగౌడ్, సంతోష్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, మల్లేశంగౌడ్ ఉన్నారు.



ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

సిరిసిల్ల: ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడంపై సిరిసిల్ల డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. జీపీసింగ్, రామ్‌రెడ్డినాయక్, బాపురెడ్డి, బాలయ్య, శ్రీవాణి, ఉమ, ఇసాక్, రఘు, రామ్‌సింగ్, కాళేశ్వరీ, కవిత, పద్మ, ప్రవీణ్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్లటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం కదంతొక్కారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కనీస వేతనం చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ముట్టడికి తరలివచ్చారు. సిరిసిల్ల నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలిరాగా పోలీసులు బారీకేడ్లు పెట్టి అడ్డుకున్నారు. - వివరాలు 8లో..

'డబుల్' జాప్యం

- దరి చేరని గూడు, నీడ
- కట్టిన ఇళ్లు ఇవ్వలేదు.. కొత్తవి నిర్మించలేదు
- జిల్లాలో పేదల ఎదురుచూపులు
- వేములవాడ ప్రాంతంలో పునాది పడలేదు



పూరి గుడిసె ముందున్న ఈమె పల్లెపు రజిత. చందుర్తి మండలం బండపల్లికి చెందిన రజిత, రాజేశం దంపతులు బండలు కొట్టుకుని జీవిస్తారు. సొంతిల్లు లేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు కాకపోవడంతో కాలనీలో ఓ గుంట భూమిని అప్పు చేసి కొన్నారు. ఆ స్థలంలోనే చిన్నగుడిసె వేసుకుని ఉంటున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు వస్తుందనే ఆశతోనే కాలం వెల్లదీస్తున్నారు.



ఇది సిరిసిల్ల శివారులోని పెద్దూరు వద్ద రెండో బైపాస్‌రోడ్డు వెంబడి నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం. ఇక్కడ రూ.27.04కోట్లతో 416 ఇళ్లను నిర్మించారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ పనులు కూడా ఇటీవల పూర్తికాగా.. పెయింటింగ్ కూడా వేశారు. వీధి దీపాల పనులు పెండింగ్ ఉన్నాయి. ఈ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. ఇప్పుడు.. అప్పుడు అంటూ అధికారులు ఇళ్లు ఇవ్వకుండా నెలలుగా జాప్యం చేస్తున్నారు.



ఇది సిరిసిల్లలోని శాంతినగర్ బైపాస్‌రోడ్డు పక్కన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ. ఇక్కడ రూ.10.73 కోట్లతో 204 ఇళ్లను రోడ్లు భవనాల శాఖ అధికారులు నిర్మించారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించలేదు. ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ పనులు పూర్తికాలేదు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దళిత పేదలు ఇక్కడ ఓ ఇల్లు వస్తుందనే నమ్మకంతో ఎదురుచూస్తున్నారు. రగుడు శివారులోనూ నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకాలనీలో వసతులు లేవు. ఇలా కట్టిన ఇళ్లను ఇంకా లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో నీడ, గూడు లేని పేదలు ఎదురుచూస్తూనే ఉన్నారు.

సిరిసిల్ల: జిల్లాలోని నిరుపేదల సొంతింటి కల నెరవేరడం లేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయినప్పటికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మాత్రం వారికి చేతికందడం లేదు. సిరిసిల్ల నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తయినా లబ్ధిదారులకు అందడం లేదు. వేములవాడ నియోజకవర్గంలో మాత్రం స్థలాల ఎంపికనే పూర్తికాలేదు. జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు సొంతింటి కల నెరవేరడం లేదు.

జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల స్వరూపం

మంజూరైనవి	: 6,886	నిర్మాణ వ్యయం	: రూ.402.28 కోట్లు
ఇప్పటి వరకు		ఇప్పటికే వెచ్చించిన మొత్తం	: రూ.208.05 కోట్లు
పూర్తయినవి	: 3,402	ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం	: రూ.5,04,000 (గ్రామీణ ప్రాంతం)
నిర్మాణంలో ఉన్నవి	: 428		
మొదలే కాని ఇళ్లు	: 3,076	ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం	: రూ.5,30,000 (పట్టణ ప్రాంతం)
లబ్ధిదారులకు పంపిణీ చేసినవి	: 1,606		

మండెపల్లిలో ఆదర్శం

తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో సీఎం కేసీఆర్‌నగర్ పేరుతో మోడల్‌కాలనీని ప్రభుత్వం నిర్మించింది. సీఎం కేసీఆర్ మండెపల్లిలోని 1200 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను 2021 జూలై 4న ప్రారంభించారు. సిరిసిల్లలోని పేదలకు దశలవారీగా ఇళ్లను పంపిణీ చేశారు.

వేములవాడలో జాడే లేదు

వేములవాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పునాదుల్లోనే ఉన్నాయి. వేములవాడ మండలం ఫాజుల్‌నగర్‌లో 40 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించారు. కోనరావుపేట మండలానికి మంజూరైన 92 ఇళ్లు, చందుర్తికి మంజూరైన 45, రుద్రంగి మండలానికి మంజూరైన 35 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పునాది కూడా పడలేదు. వేములవాడఅర్బన్‌కు మంజూరైన 800 ఇళ్లలో 144 ఇళ్ల పనులు మొదలైనా కొనసాగట్లేదు.

ఇల్లంతకుంట,బోయినపల్లిల్లో నూఇదే దుస్థితి

మానకొండూరు నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట మండలానికి 340 ఇళ్లు మంజూరు కాగా.. 184 నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంకా లబ్ధిదారులకు అందించలేదు. 156 ఇళ్ల పనులు మొదలే కాలేదు. చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలానికి మంజూరైన 65 ఇళ్లు ఇంకా టెండర్ల స్థాయిలోనే ఉంది.

కారణాలేమిటి ?

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలకు చాలా గ్రామాల్లో స్థలం లేదు. జాగ లేని కారణంగా పునాదులు తీయలేదు. కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టు పొందిన సంస్థలు పనులు చేయకుండా చేతులెత్తేశాయి. నిజానికి ఒక్కో ఇంటి నిర్మాణానికి పెరిగిన ధరల ప్రకారం రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలు ఖర్చు అవుతుండగా.. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోక పనులు చేయకుండా కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేశారు.

నోడల్ అధికారి లేక...

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షించే నోడల్ అధికారిగా ఉన్న సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాస్‌రావు ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన అధికారికి, లేదా మరో అధికారిని నోడల్ అధికారిగా ఇంకా నియమించలేదు. జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై నోడల్ అధికారి ఎవరూ లేకపోవడంతో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఫలితంగా జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం ఇంకా పేదల దరి చేరలేదు. నిరుపేదల సొంతింటి కల నెరవేరలేదు.

ఆలకించండి.. ఆదుకోండి

- ప్రజావాణికి బారులు తీరిన బాధితులు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్‌జయంతి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

సిరిసిల్లఅర్బన్: సారూ.. సమస్యలు పరిష్కరించండి.. అంటూ బాధితులు జిల్లాలోని నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు సోమవారం తరలివచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాని వారు కలెక్టరేట్ దారి పట్టారు. తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్ అనురాగ్ జయంతికి మొరపెట్టుకున్నారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, పలు శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

పొలాలు ముంపునకు గురవుతున్నాయి



పెద్దూరులోని భామనికుంట చెరువు వెనుక భాగంలో దాదాపు 20 ఎకరాల్లోని పంటలు ఏటా మునుగుతున్నాయి. భామనికుంట చెరువు తూములు మూసివేశారు. కట్ట ఎత్తు పెంచడంతో బ్యాక్‌వాటర్‌లో మా పొలాలు మునిగిపోతున్నాయి. సర్దాపూర్‌లోని తూముకుంట చెరువు పరిస్థితి ఇట్లాగే ఉంది. ఏటా పంట నష్టపోతున్నాం. – పెద్దూరు, సర్దాపూర్ రైతులు

కొడుకులు పట్టించుకుంట లేరు



నాపేరు గాజుల రేణుక. సిరిసిల్లలోని సుందరయ్యనగర్‌లో నాభర్త లింబాద్రితో కలిసి ఉంటున్న. మాకు నలుగురు కొడుకులు. కొన్ని రోజులుగా కొడుకులు మమ్మల్ని పట్టించకోవడం లేదు. నా భర్తకు వచ్చే పెన్షన్ డబ్బులతోనే కాలం వెల్లదీస్తున్నాం. ఏ పని చేసుకోలేకపోతున్నాం. అధికారులు దయచేసి న్యాయం జరిగేలా చూడాలి. – వృద్ధ దంపతులు

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు



జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని సర్వేనంబర్ 67లో 1982లో గుండ్లపెల్లి భూమయ్య, వెల్దండి నారాయణ కలిసి 12 ఎకరాల భూమిని కొని, విక్రయించారు. అందులో నుంచి 8 మందిమి కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. కానీ ఇప్పుడు భూమయ్య కొడుకులు భూమి తమదని మమ్మల్ని బెదిరిస్తున్నారు. మా భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దాన్ని రద్దు చేసి న్యాయం చేయాలి. – భూ బాధితులు

ఉద్యోగులను మోసం చేస్తున్నారు



రాజన్న ఆలయంలో సురక్ష సెక్యూరిటీ సర్వీసెస్‌లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టర్ మోసం చేస్తున్నారు. దేవస్థానం ప్రతి ఉద్యోగికి రూ.21వేలకు పైగా సురక్ష సెక్యూరిటీకి చెల్లిస్తుంటే.. కాంట్రాక్టర్ మాత్రం ఉద్యోగులకు రూ.13వేల వేతనం ఇస్తున్నాడు. ఈ విషయంపై అధికారులు విచారణ చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలి. – కదారి రాములు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయాలి



ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్, గుండారం గ్రామాల బొంగులకింది తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా చేయాలి. మా తండాలో 540 మంది నివసిస్తున్నాం. సగం గ్రామం తిమ్మాపూర్‌లో, మరో సగం గుండారంలో ఉన్నాం. మా బొంగులకింది తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి. – బొంగుల కింది తండావాసులు

వర్షం బాధితులను ఆదుకోవాలి



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయి, పంట నష్టపోయిన బాధితులను ఆదుకోవాలి. చిన్నబోనాలలోని పెద్దచెరువు తెగిపోవడంతో దిగువన ఉన్న పొలాలు కొట్టుకుపోయి రైతులు నష్టపోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెరువులకు గండి పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.– కాంగ్రెస్ నాయకులు

వాటర్‌ట్యాంకులు శుభ్రం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్

- సీజనల్ వ్యాధులను నివారించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- తల్లిపాలవారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కూళ్లు, గురుకులాలు, హాస్టళ్లలోని వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని, సీజనల్ వ్యాధులను కట్టడి చేసేందుకు దోమలు, ఈగలు పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. మొక్కలు నాటేందుకు సరైన సమయమన్నారు. మానేరు, మూలవాగుల వెంబడి వరద ఉధృతిని పరిశీలించాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు తల్లిపాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. క్షేత్రస్థాయిలో తల్లి పాల ఆవశ్యకతను వివరించేందుకు పోస్టర్లను అంటించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎస్.ఖీమ్యానాయక్, ఆర్డీవో పి.పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

- 28 అంశాలకు ఆమోదం
- 'డబుల్' ఇళ్లపై నిరసన తెలిపిన బీజేపీ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ కౌన్సిలర్లు

వేములవాడ: వేములవాడ మున్సిపల్ సమావేశం సాదాసీదాగా సాగింది. చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ అధికారులు ఎజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం ఒక్కో అంశంపై సభ్యులు, అధికారులు చర్చించారు. తమ వార్డుల్లోని సమస్యలను కౌన్సిలర్లు అధికారుల ముందు ఏకరువు పెట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు నిలిచి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని, ఖాళీ ప్రదేశాలల్లో నీరు నిలిచి దోమలు పెరిగిపోయాయన్నారు. కుక్కలు పెరిగిపోయి వీధులపై జనాలపై దాడి చేస్తున్నాయని పలువురు కౌన్సిలర్లు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్లు సూచించిన అంశాలపై తక్షణమే చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ మాధవి హామీ ఇచ్చారు. అనంతరం 28 అంశాలకు ఆమోదం తెలిపినట్లు ఇన్‌చార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి ప్రకటించారు. డీఈ తిరుపతి, ఏఈ నర్సింహస్వామి, నర్మద, టీపీవో సాయికృష్ణ పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వండి

రాష్ట్రం సిద్ధించి తొమ్మిదేళ్లు గడుస్తున్నా పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందలేదని, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలువురి ఇళ్లు కూలిపోయి ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొద్దనిద్ర వదిలి పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చేలా చూడాలని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ కౌన్సిలర్లు రేగుల సంతోష్‌బాబు, ముప్పిడి సునంద, రామతీర్థపు కృష్ణవేణి, అన్నారం ఉమారాణి, గడ్డమీది లావణ్య, తిరుమల్‌రెడ్డి కవితారెడ్డి, నాయకులు అన్నారం శ్రీనివాస్, ముప్పిడి శ్రీనివాస్, సుమంత్‌రెడ్డి, హరీశ్ పాల్గొన్నారు.

తొమ్మిదోవార్డులో అక్రమ నిర్మాణాలు

తొమ్మిదోవార్డులో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని బీజేపీ కౌన్సిలర్ అన్నారం ఉమారాణి సోమవారం విలేకరులకు తెలిపారు. అనుమతులకు విరుద్ధంగా ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నా బీఆర్ఎస్ నేత చూస్తూ ఊరుకోవడం వెనుక ఆంతర్యమేమిటంటూ ప్రశ్నించారు. తక్షణమే చర్యలు తీసుకుని సెట్‌బ్యాక్ ఉండేలా చూడాలని కోరారు.

క్లుప్తంగా

నియామకం



ప్రశాంత్ గౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న గోవర్ధన్ గౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా గౌడసంక్షేమ సంఘం సహాయ కార్యదర్శిగా ప్రశాంత్‌గౌడ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ప్రశాంత్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌గౌడ్ మాట్లాడుతూ..తన నియామకానికి సహకరించిన గోవర్ధన్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజుగౌడ్, దేవదాస్, లక్ష్మీపతి గౌడ్, దత్తాద్రి గౌడ్, అమర్, రామాగౌడ్, కొండ రమేశ్ గౌడ్, బాల్‌రాజు గౌడ్, నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దుబాయిలో నిజామాబాద్ వాసి ఆత్మహత్య



లక్ష్మణ్ (ఫైల్)

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన జక్కుల లక్ష్మణ్ (38) దుబాయ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ గ్రామానికి చెందిన జక్కుల లక్ష్మణ్ రూ.10 లక్షల వరకు అప్పుచేశాడు. దుబాయి వెళ్లి అక్కడ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. వేతనాలు సరిగా ఇవ్వకపోవడంతో పాటు అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపంతో సోమవారం గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శకుంతల, కుమారుడు మల్లికార్జున్ ఉన్నారు.

సీసీఎస్ పోలీసుల సోదాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ యూత్ నాయకుడు, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు ఇంట్లో సోమవారం సీసీఎస్ పోలీసులు సోదాలు నిర్వహించారు. అధికారులు మునిగెల రాజును ప్రశ్నించి పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

కక్ష్యపూరితంగానే సోదాలు : కాంగ్రెస్ నాయకుడు మునిగెల రాజు

సీసీఎస్ పోలీసుల సోదాల విషయమై 'సాక్షి' మునిగెల రాజును వివరణ కోరగా తనపై కక్ష్య పూరితంగా మంత్రి కేటీఆర్ ఆదేశాలతో పోలీసులు సోదాలు నిర్వహించారని రాజు ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థ విధానాలను నిరసిస్తూ ప్రజల తరఫున ఉద్యమాలు చేస్తున్నందుకే దాడులు నిర్వహించి భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నిస్తున్నారన్నారు. అయినా ప్రజల ప్రజల కోసం పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు.

కుక్కలదాడిలో 13 గొర్రెలు మృతి

మల్లాపూర్ : కుక్కలదాడిలో 13 గొర్రెలు మృతిచెందగా, మరో 7 గొర్రెలను గాయపర్చాయి. గ్రామానికి చెందిన కసాడి భూమేశ్ యాదవ్‌కు చెందిన గొర్రెలను మేపేందుకు తీసుకెళ్తుండగా, వీధి కుక్కలు దాడి చేయడంతో 13 గొర్రెలు మృతిచెందగా మరో 7 గొర్రెలకు గాయపర్చాయి. దాదాపు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని భూమేశ్‌కు ప్రభుత్వ పరిహారం చెల్లించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కళాశాలలో చోరీకి యత్నం

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. ల్యాబ్ తాళాలు పగులగొట్టి సామగ్రిని చిందరవందర చేయడంతోపాటు కంప్యూటర్ గది తాళాలు పగులగొట్టేందుకు విఫలయత్నం చేశారని కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యలు పరిష్కరించండి

- డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించిన జీపీ కార్మికులు
- పోలీసుల వలయాన్ని ఛేదించుకొని దూసుకెళ్లిన కార్మికులు
- పెట్రోల్ బాటిల్‌తో కార్మికుడి ఆత్మహత్యా యత్నం
- వీఆర్‌ఏ ఇస్సాదారులు ధర్నా, ఆందోళన
- ప్రజావాణికి వెళ్లేవారికి ఆటంకం



ర్యాలీగా వెళ్తున్న పంచాయతీ కార్మికులు

సిరిసిల్ల: జిల్లా కలెక్టరేట్ సోమవారం పంచాయతీ కార్మికుల ధర్నాలు.. నిరసనలతో అట్టుడికింది. సిరిసిల్ల–వేములవాడ ప్రధాన రహదారి పక్కనే కలెక్టరేట్ మెయిన్ గేటువద్ద పంచాయతీ కార్మికులు బైఠాయించారు. ఒక్కసారిగా కార్మికులు ముట్టడించడంతో ఉద్రిక్తంగా మారింది. పోలీసులు కార్మికులను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా మెయిన్ గేటు వద్దే బారికేడ్ల ఏర్పాటు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పంచాయతీ కార్మికులు నినాదాలు చేస్తూ పెద్దఎత్తున ఆందోళన చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడించగా పోలీసులు, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది.

పెట్రోల్ బాటిల్‌తో ఆత్మహత్యా యత్నం

బోయినపల్లి మండలం నీలోజిపల్లికి చెందిన కత్తెరపాక నరేశ్ పెట్రోల్ బాటిల్‌లో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్మికులు పోలీసులు బారికేడ్లను ఛేదించుకుని ముందుకెళ్లారు. పోలీసులు కలెక్టరేట్ ముందున్న మరో ప్రవేశగేట్లను మూసివేసి కట్టడి చేశారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీపీవో రవీందర్, కలెక్టరేట్ ఏవో గంగయ్య వచ్చి వినతిపత్రం స్వీకరించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎస్సైలు వెంకటేశ్, ఎల్లాగౌడ్, రవీందర్, పోలీసు బలగాలు కట్టడి చేశాయి. ఈ ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, మోర అజయ్, వీర్నపల్లి ఎంపీటీసీ సభ్యుడు మల్లారపు అరుణ్, కార్మిక నాయకులు గురజాల శ్రీధర్, అశోక్, మల్యాల నర్సయ్య, సూరం పద్మ, శ్రీరాం సదానందం, రూప తదితరులు పాల్గొన్నారు. బీఎస్పీ నాయకులు అంకని భాను, స్వామి తదితరులు కార్మికుల ఆందోళనకు మద్దతు తెలుపుతూ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అర్హులందరికీ దళితబంధు అందించాలి



కలెక్టరేట్ ఎదుట దళిత హక్కుల పోరాట సమితి ధర్నా

దళిత బంధు అర్హులందరికీ ఇవ్వాలని, జీవో 58, 59 ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ దళిత హక్కుల పోరాట సమితి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసింది. గృహలక్ష్మి పథకంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని, అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలు, కేంద్రం రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమితి ప్రతినిధులు మాట్ల అశోక్, మంద సుదర్శన్, కంసాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 81ను రద్దు చేయాలి..



ఆందోళన చేస్తున్న సుంకరి ఇస్సాదారులు

రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను పర్మినెంట్ చేస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 81ను రద్దు చేయాలని, ఇస్సాదారుల విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన ఇస్సాదారులు, కలెక్టరేట్‌లోకి చొచ్చుకొని వెళ్లి నినాదాలు చేశారు. జిల్లాలో 4వేల మంది ఇస్సాదారులున్నారని, వోటా బంధీ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సుంకరి ఇస్సాదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నక్క పర్శరాములు, జిల్లా ప్రతినిధులు మీసాల బాలరాజు, బత్తుల దేవరాజు, దామెర నర్సయ్య, వివిధ మండలాల నాయకులు ప్రభాకర్, ఎల్లయ్య, స్వామి, రాజు, జగన్, గట్టయ్య, శ్రీనివాస్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

'మరమ్మతు'కు కౌన్సిల్ ఆమోదం

- వర్షాలకు పాడైన రోడ్లకు మరమ్మతు
- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- పాలకవర్గం అత్యవసర సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన రోడ్లను మరమ్మతులు చేపట్టేందుకు మున్సిపల్ పాలకవర్గం సిద్ధమైంది. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వరదల నియంత్రణకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్ల మరమ్మతుకు, శానిటేషన్ సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గ సభ్యులతో ప్రత్యేక నిధులు కేటాయించుకోవడం జరిగిందన్నారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కుక్క కరిచిందమ్మా !



మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లకు చూపుతున్న చారి

వేములవాడ: వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయని, సోమవారం తనపై దాడిచేసి కరిచాయంటూ చారి అనే వ్యక్తి వాపోయాడు. చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్ల వద్దకు వెళ్లి చారి గాయాన్ని చూపించారు. త్వరలోనే కుక్కలను అటవీ ప్రాంతాలకు తరలిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే బీఆర్ఎస్‌పై విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న జిందం కళ

సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్ పార్టీ మనుగడ కోల్పోతోందనే భయంతో ప్రజలను మభ్యపెట్టేందుకే ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కాముని వనిత మంత్రి కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మంత్రి కేటీఆర్ చొరవతోనే సిరిసిల్ల పట్టణం అభివృద్ధి చెందిందన్నారు. పద్మశాలీల అభివృద్ధికి కృషిచేస్తున్న మంత్రి కేటీఆర్‌ను పద్మశాలీ మహిళంతా ఓడిస్తామని కాముని వనిత పేర్కొనడం సరికాదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మహిళా కౌన్సిలర్లు ధర్నాం అరుణ, గడ్డం లత, పోచవేణి సత్య, ఒగ్గు ఉమ, జాగీరు శైలు, అడ్డగట్ల మాధవి, ఆడెపు సౌజన్య, కల్లూరి లత, రాపెల్లి అరుణ, బుర్ర లక్ష్మి, దార్ల కీర్తన, దిడ్డి మాధవి, తదితరులున్నారు.

నేడు బోయినపల్లిలో ఠాణాదివస్

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఠాణా దివస్ నిర్వహించనున్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరిస్తారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలోని సమస్యలను నేరుగా ప్రజల నుంచి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ఠాణాదివస్ ఏర్పాటు చేశారు. ఈక్రమంలో పోలీస్ సిబ్బంది వారం రోజులుగా గ్రామాల్లో దండోరా వేయించి ఠాణాదివస్‌పై అవగాహన కల్పించారు. ఉదయం 10.30 గంటల నుంచి ఎస్పీ అందుబాటులో ఉండి, ఫిర్యాదులు తీసుకోనున్నారు.

సామాజిక సేవా కార్యకర్త అవార్డు అందుకున్న వెంకట్‌రెడ్డి

- ఢిల్లీలో అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న వెంకట్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి సోమవారం రాత్రి ఢిల్లీలో జాతీయస్థాయి సామాజిక సేవా కార్యకర్త అవార్డు అందుకున్నారు. కొంతకాలంగా వెంకట్‌రెడ్డి చేస్తున్న సామాజిక కార్యక్రమాలను గుర్తించి జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. సొంత లాభం కొంత మానుకో పొరుగువాడికి సహాయ పడవోయి అనే సామెత ఇక్కడ అక్షరాల నిజమైంది. ఎన్నో ఏళ్లుగా నేను ఉన్నానని భరోసా ఇస్తూ.. సామాజికంగా.. ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. వెంకట్‌రెడ్డి చేస్తున్న సేవలను గుర్తించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెక్టార్, జనపథ్ న్యూఢిల్లీ వారు ఉత్తమ సామాజిక సేవ కార్యకర్త అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును ఢిల్లీలో సోమవారం అందుకున్నారు. ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ కో ఆప్షన్ సభ్యులు హైమద్, మండలంలోని ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ చేనేత ఐక్య వేదిక అధికార ప్రతినిధిగా అక్షిత



అక్షిత


సప్తగిరికాలనీ(కరీంనగర్): జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధిగా కరీంనగర్‌కు చెందిన డాక్టర్ అక్షితను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కష్టపడేవారికి సరైన గుర్తింపు ఉంటుందని, సంఘం బలోపేతానికి పాటుపడుతున్న కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు అక్షిత సేవలను మరింతగా వినియోగించుకునేందుకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్, రాష్ట్ర ఇన్‌చార్జి కాటా రాందాస్, అధ్యక్షుడు మాడ రాజా, గౌరవ అధ్యక్షులు తిరందాస్ వేణుగోపాల్, కోట దామోదర్, యువజన విభాగం అధ్యక్షుడు చిలివేరి రామకృష్ణ, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఎలుబాక సుజాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- రక్షణ కోసం 87126 56425 కాల్ చేయండి
- షీటీంకు కృతజ్ఞతలు అంటూ లేఖ రాసిన బాలిక



ఎస్పీ అఖిల్ మహాజన్



షీటీంకు కృతజ్ఞతలు తెలుపుతూ అమ్మాయి రాసిన లేఖ

సిరిసిల్లక్రైం: మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. జిల్లా షీటీమ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఓ అమ్మాయి లేఖ రాసి వాట్సాప్ పంపిన సందర్భంగా ఎస్పీ సోమవారం పలు వివరాలు వెల్లడించారు. కృతజ్ఞతలు తెలుపుతూ బాలిక లేఖ రాయడం తమపై బాధ్యత పెంచిందన్నారు. జిల్లాలో కొందరు పోకిరీలు చేస్తున్న ఆగడాలను వాట్సాప్ యువర్ ఎస్పీ, షీటీం, డయల్ 100కు చేరుతున్నాయన్నారు. విద్యాసంస్థలు, జనరద్దీ అధికంగా ఉన్న ఏరియాలో నిత్యం గస్తీ ఏర్పాటు చేశామన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో షీటీమ్ సిబ్బంది 11 ఫిర్యాదులలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైన వేధింపులకు గురైతే 87126 56425, డయల్ 100కు ఫిర్యాదు చేయాలని కోరారు.

గ్రీవెన్స్ డేకు 22 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేకు 22 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలకు వెళ్లాలని సంబంధిత స్టేషన్ అధికారులను ఆదేశించారు. సివిల్ తగాదాలను కోర్టు పరిధిలో పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మానవహక్కుల పరిరక్షణకు సహకరించాలి

- జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు తిరుపతినాయక్



మాట్లాడుతున్న తిరుపతినాయక్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కులమత బేధాలకు అతీతంగా మానవహక్కుల పరిరక్షణకు అందరూ కట్టుబడి పని చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు అజ్మీరా తిరుపతినాయక్ కోరారు. మండలంలోని అక్కపల్లిలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తిరుపతినాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని కులాల ప్రజలు కలిసి మెలిసి ఉంటూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సర్పంచ్ ముక్క మధుకర్, ఉపసర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, ఆర్ఐ సంతోష్, హెడ్‌కానిస్టేబుల్ భాష, వీపీవో రమేశ్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత



భక్తుడికి నగదు అప్పగిస్తున్న సిబ్బంది

వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తుడు డబ్బులు పోగొట్టుకోగా ఎస్పీఎఫ్ సిబ్బంది తిరిగి అప్పగించారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన యాద రాములు సోమవారం కుటుంబ సభ్యులతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేస్తున్న సమయంలో నగదు, ఆధార్‌కార్డు మర్చిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శైలజ గమనించి కవర్‌ను ఎస్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కుమారస్వామికి అప్పగించింది. ఆలయ మైక్ ద్వారా రాములును రప్పించి రూ. 2500 నగదు, ఆధార్‌కార్డును అప్పగించారు. ఇక్కడ కానిస్టేబుల్ శ్రీధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు

జగిత్యాలక్రైం: స్థానిక ధర్మపురి రోడ్డులోని ఓ పెట్రోల్‌బంక్‌లో సోమవారం ఉదయం వాహనదారులు పోసుకున్న పెట్రోల్‌లో నీరు వచ్చింది. దీంతో వారు ఆందోళన చేపట్టారు. హనుమాన్‌వాడకు చెందిన నరేశ్ క్తి తన వాహనంలో పెట్రోల్ పోయించుకున్నాడు. వాహనం మొరాయించడంతో అనుమానం ఓ బాటిల్‌లో మరికొంత పెట్రోల్ పోయించాడు. దీంతో పెట్రోల్ కల్తీ అయిందని గుర్తించాడు. వాహనదారులు ఆందోళనకు దిగారు. సిబ్బంది వారిపైదురుసుగా ప్రవర్తించి, వీడియో తీశారు. ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు.. ఆందోళన ఉధృతం చేయడంతో సిబ్బంది దిగివచ్చారు. పెట్రోల్ పోయించుకున్న వారికి డబ్బులు వాపస్ ఇవ్వడంతో శాంతించారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా

జగిత్యాల జోన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరికి రూ.1,43,952 జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.నారాయణ సోమవారం తీర్పునిచ్చారు. విజిలెన్స్ సీఐ కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలం బట్టపల్లి గ్రామానికి చెందిన కొక్కుల సురేశ్, జగిత్యాల మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన బొక్కెనపల్లి రమేశ్ విద్యుత్ చౌర్యానికి పాల్పడగా అధికారులకు ఫిర్యాదు చేయడంతో మొదటిసారిగా భావించి ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మళ్లీ జూలై 24, 2019న విద్యుత్ చౌర్యానికి పాల్పడటంతో విజిలెన్స్ అధికారులు ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. కేసు విచారణ అనంతరం కొక్కుల సురేశ్‌కు రూ.93,390, బొక్కెనపల్లి రమేశ్‌కు రూ.50,562 జరిమానా విధిస్తూ జడ్జి తీ ర్పుచెప్పారు. జరిమానా చెల్లించకపోతే మూడునెలల జైలుశిక్ష ఉంటుందన్నారు. విజిలెన్స్ ఎస్సైలు నిరంజన్ రెడ్డి, నరేశ్, సిబ్బందిని అభినందించారు.

గ్రావిటీ కెనాల్ ఇసుక మాయంపై కేసు

- జేసీబీ, టిప్పర్ స్వాధీనం

బోయినపల్లి(చొప్పదండి): ఎల్లంపల్లి ప్రాజెక్టు గ్రావిటీ కెనాల్ కోసం సేకరించిన ఇసుకను అక్రమంగా తరలించిన వారిపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. మండలంలోని తడగొండ నుంచి గంగాధర వెళ్లే దారిలో గ్రావిటీ కెనాల్ ఉంది. ఎనిమిదేళ్ల క్రితం గ్రావిటీ కెనాల్ పనులు చేపట్టారు. అప్పటి జిల్లా మైనింగ్ అధికారుల అనుమతులతో.. ఆ సమయంలో కెనాల్ పక్కన స్థలంలో దాదాపు 500 ట్రిప్పుల ఇసుకను డంప్ చేశారు. కాగా ఇసుకడంప్ చేసిన ప్రదేశంలో ఆదివారం ఉదయం నుంచి ఒకరు జేసీబీ టిప్పర్లతో తరలిస్తున్నాడు. ఈ విషయం కొందరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జేసీబీ, టిప్పర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. కాగా 8ఏళ్ల కింద మట్టి కాల్వపనులు చేసిన ఓ వ్యక్తికి డబ్బులు రాకపోవడంతో గ్రావిటీ కెనాల్ పనులు పొందిన ఏజెన్సీ వారు ఇసుక తీసుకెళ్లాలని చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలో సదరు వ్యక్తి వందల ట్రిప్పులు అటు గంగాధర, ఇటు తడగొండ ప్రాంతాలకు తరలించాడు. కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన వెలుగులోకి వచ్చింది.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్లఅర్బన్: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని సెస్ చైర్మన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు అందజేశారు. కార్యక్రమానికి డీఎస్పీ నాగేంద్రచారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తనవంతు సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సభ్యులు రవి, ప్రభాకర్, సాయికృష్ణ ఉన్నారు.